క్లుప్తంగా

తెనాలి పట్టణ అభివృద్ధికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలి అర్బన్: తెనాలి పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 23వ వార్డులో మంగళవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని పలు రోడ్ల విస్తరణ పనులు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే మరమ్మతులు కూడా చేస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు, ఏఈ సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పండగ ఆదాయం రూ.7లక్షలు

తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్



తెనాలిఅర్బన్: సంక్రాంతి పండుగ సందర్భంగా తెనాలి ఆర్టీసీ డిపో నుంచి అదనపు బస్సులు నడపడం వల్ల రూ.7లక్షల ఆదాయం అదనంగా సమకూరిందని డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు బస్సులు నడపడం జరిగిందన్నారు. హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ, గుంటూరుకు 38 సర్వీసులు నడిపినట్లు చెప్పారు. ఆర్టీసీని ప్రయాణికులు ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అన్న క్యాంటీన్ ఆకస్మిక తనిఖీ



తెనాలిఅర్బన్: చెంచుపేట మార్కెట్ యార్డులోని అన్న క్యాంటీన్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేదలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, భోజనం చేసే వారి నుంచి వివరాలు సేకరించారు. సమయానికి వీటిని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

'ప్రియదర్శిని'లో ప్రాజెక్టు ఫెస్ట్-2025



తెనాలిఅర్బన్: శాస్త్ర, సాంకేతిక, సామాజిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల కమిటీ అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో ప్రాజెక్టు ఫెస్ట్-2025 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ బొల్లిముంత శివరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో కంప్యూటర్ హెచ్‌ఓడీ వేదాంతం శ్రీ సుధా, అధ్యాపకులు దాసరి సాంబశివరావు, షేక్ ఆరిఫా, తదితరులు పాల్గొన్నారు.

సంకీర్తనల ఆలాపన



తెనాలి: పట్టణ నెహ్రూ రోడ్డులో ఉన్న రుక్మిణి సత్యభామసమేత గోవర్ధనస్వామి, వీరప్రతాప ఆంజనేయస్వామి వార్ల దేవస్థానం ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ సంకీర్తన గానాలాపన జరిగింది. ప్రోగ్రాం అసిస్టెంట్ ఇ.అమ్ముడు పర్యవేక్షణలో హరినామ సంకీర్తన బృందం గురువు పెరవలి వంశీకృష్ణ శిష్య బృందం సంకీర్తన గానం చేశారు. తొలుత బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథ శర్మ ఆధ్యాత్మిక ప్రసంగం, అందె తన్మయి కూచిపూడి నృత్య ప్రదర్శన, అనంతరం సంకీర్తనను నిర్వహించారు. టీవీఎస్ శాస్త్రి, లక్ష్మీ నరసింహారావు, శివశంకర రాజు, అందె బాలచంద్రమౌళి, మాదాల సాయిహనుమంతరావు నందికంటి రామాంజనేయులు పాల్గొన్నారు. సంకీర్తన బృందం మాదాల నాగార్జున, అందె రాజేశ్వరి, తన్మయి, తూనుగుంట్ల దుర్గామల్లేశ్వరి, కొప్పురపు అనిత మాధవి, దంటు శర్వాణి, నందికంటి జయలక్ష్మి, శ్రీపూజిత, కొత్తమాసు పుష్పలత సంకీర్తనగానం చేసినవారిలో ఉన్నారు.

దొంగతనాలకు సాంకేతిక తాళం

- తాళం వేసిన ఇళ్లపై దొంగల కన్ను
- యాంటీ థెఫ్టింగ్ అలారం లాక్‌తో చోరీలకు చెక్
- తాళం చెవి పెట్టకుండా.. తాళం బుర్రను పట్టుకున్నా అలారం ఆన్
- ఈ-కామర్స్ సైట్లలో అందుబాటు ధరల్లో..



కొల్లిపర: చోరీల నియంత్రణకు డిజిటల్ లాక్ (తాళం) వినియోగించేలా పోలీసు శాఖ ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఇటీవల ఎక్కువగా తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. వీరిని ఆధునిక సాంకేతికతతో కూడిన తాళంతో కట్టడి చేయాలని కొన్ని కంపెనీలు ప్రణాళిక రూపొందించాయి. ఇందుకోసం యాంటీ థెఫ్ట్ అలారం లాక్, యాంటీ థెఫ్ట్ అలారం డోర్, విండోస్ తదితర పరికరాలు తయారు చేస్తున్నాయి. వీటిని వినియోగదారుల తమ బడ్జెట్‌లో కొనుగోలు చేసి ఉపయోగించుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఇవి లభిస్తున్నాయి. దొంగలు ఇటు వంటి తాళం పగులగొట్టేందుకు ప్రయత్నిస్తే... వెంటనే అలారం మోగుతుంది. దీంతో ఇరుగుపొరుగు వారు అప్రమత్తమయ్యే అవకాశం ఉంది. వీటిని ప్రతి ఒక్కరూ వినియోగించాలని, అప్పుడు కొంత వరకు దొంగతనాలు జరగకుండా నియంత్రించవచ్చు అని పోలీస్ శాఖ సూచిస్తోంది.

ఆన్ మోడ్‌లోనే

కుటుంబంలోని అందరూ బయటికెళ్తున్న సమయంలో ఇంటి తలుపులకు, కిటికీలకు డిజిటల్ యాంటీ థెఫ్ట్ డివైజ్ అమర్చాలి. దీనిని ఎల్లవేళలా ఆన్ మోడ్‌లో ఉంచాలి. దీంతో కొత్త వ్యక్తులు తలుపులు, కిటికీలు తీసే ప్రయత్నం చేస్తే.. వెంటనే ఇంటిలో ఏర్పాటు చేసిన డిజిటల్ డివైజ్ నుంచి అలారం మోగుతుంది. దీంతో దొంగలు భయపడి అక్కడి నుంచి పారిపోతారు. లేదా ఇరుగుపొరుగు వారు అక్కడికి రావడం జరుగుతుంది.



ఆన్‌లైన్‌లో లభిస్తున్న డిజిటల్ లాక్

భారీగానే శబ్దం..

యాంటీ థెఫ్ట్ అలారం లాక్‌ను గ్రౌండ్ ఫ్లోర్ కిటికీలకు అమర్చడం మరింత ఉపయోగకరంగా ఉంటుంది. ఇది 105-110 వరకు డిసిబుల్స్ శబ్దంతో మోగుతుంది. చాలాదూరం వరకు శబ్దం స్పష్టంగా వినిపిస్తుంది.

ప్రతి ఇంటికి అమర్చుకోవాలి



యాంటీ థెఫ్టింగ్ అలారం లాక్ తక్కువ ధరలో లభిస్తుంది. బయటకు వేళ్లే సమయంలో అమర్చుకోవడంతో దొంగతనాలను నివారించవచ్చు. ప్రతి ఒక్కరూ ఇలాంటి తాళాలు వాడితే మంచిది.

– పి.కోటేశ్వరరావు, ఎస్‌ఐ, కొల్లిపర

ధర రూ.300–రూ.600 వరకు ఉంటుంది.

ఆన్‌లైన్‌లో అందుబాటులో..

నాణ్యమైన డిజిటల్ లాక్, డోర్ డివైజ్‌లు అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి ఈ కామర్స్ సైట్స్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆయా కంపెనీలు బట్టి వీటి ధరలు ఉన్నాయి. పూర్తిగా తనిఖీ చేసుకున్నాకే కొనుగోలు చేయాలి.

మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

తెనాలి: తెనాలి వెల్ఫేర్ డెవలప్మెంట్ సొసైటీ (టీడబ్ల్యూడీఎస్) ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నారు. స్థానిక కొత్తపేటలోని ఇన్ఫర్మాటిక్స్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సొసైటీ బాధ్యులు మంగళవారం తెలిపారు. సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. మహిళల స్వయం ఉపాధి కోసం తగిన ఆసరానిచ్చే కృషిలో భాగంగా డిజిటల్ అక్షరాసత్యను అందించాలనేది తమ భావనగా చెప్పారు. ఈ కోర్సులో కంప్యూటర్ భాగాల ప్రాథమిక ఆపరేషన్, విండోస్ ఫండ మెంటల్స్, ఫైల్, ఫోల్డర్ల నిర్వహణ, టైపిగ్ స్కిల్స్, మైక్రోసాఫ్ట్ వర్డ్‌లో పత్రాలు చేయడం, మైక్రోసాఫ్ట్ ఎక్సెల్‌లో డేటా ఎంట్రీ ఇంటర్‌నెట్ సర్ఫింగ్‌లో శిక్షణనిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు 94921 25064 నంబరుకు కార్యాలయ పని వేళల్లో ఫోను చేసి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు సునీల్, చంద్రకుమారి, శామ్యూల్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరించిన సొసైటీ బాధ్యులు

ఇండియా లేబర్ లైన్ చైతన్య ప్రచార రథయాత్ర

తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్, ఇండియా లేబర్ లైన్ సంయుక్తంగా ఇండియా లేబర్ లైన్ చైతన్య ప్రచార రథ యాత్రను మంగళవారం తెనాలిలో నిర్వహించారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ అసోసియేషన్ న్యాయవాదులు.. యాత్ర గోడ పత్రికను ఆవిష్కరించి, ప్రచారాన్ని ప్రారంభించారు. ఇండియా లేబర్ లైన్‌తో కొన్ని వేల మంది కార్మికులకు న్యాయం జరుగుతుందని బేతాళ ప్రభాకర్ చెప్పారు. కార్మికులంతా ఉచిత హెల్ప్ లైన్ నంబరు (1800 833 9020)ను తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఇండియా లేబర్ లైన్ స్టేట్ కో-ఆర్డినేటర్ మాధవరావు సూచించారు. ప్రచార చైతన్య రథయాత్ర సందర్భంగా తెనాలి 2టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీరాములు నాయక్, ఎస్‌ఐ రమేష్‌బాబు గోడ పత్రికను ఆవిష్కరించారు. పట్టణంలోని ముఖ్యమైన కార్మిక ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. లేబర్ లైన్ గుంటూరు ఫీల్డ్ ఆఫీసర్ సురేష్, విజయవాడ ఫీల్డ్ ఆఫీసర్ ఈశ్వర్, కనక దుర్గ పాల్గొన్నారు.



రథయాత్ర గోడ పత్రికను ఆవిష్కరించిన బేతాళ ప్రభాకర్

చిన్న కోరిక.. పెమ్మసాని పెద్ద మనసు



ఇంటివద్ద కొత్త సైకిల్‌లో విద్యార్థి శరత్



మంత్రి పెమ్మసానికి సమస్యను వెల్లడిస్తున్న విద్యార్థి(ఫైల్)

తెనాలి: విద్యార్థి చొరవ చేసి పాఠశాలకొచ్చే కేంద్ర సహాయ మంత్రికే తన సమస్యను చెప్పుకున్నాడు. ఆ విద్యార్థి ధైర్యం మెచ్చిన మంత్రి పెమ్మసాని అన్న మాట ప్రకారం అతనికి సైకిల్ కొనిచ్చాడు. దీంతో విద్యార్థి ఆనందానికి అవధులు లేవు. నంది వెలుగు జెడ్పీ ఉన్నత పాఠశాల భవన ప్రారంభోత్సవం ఈ నెల 18న జరిగింది. గుంటూరు ఎంపీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రికి స్వాగతం పలికిన పాఠశాల విద్యార్థుల్లో ఏడో తరగతి చదువుతున్న మందా శరత్ ఉన్నాడు. హైస్కూలుకు, తన ఇంటికి రెండు కిలోమీటర్ల దూరం ఉందని, ప్రతిరోజూ నడిచి రావడం తనకు ఇబ్బందిగా మారిందని ఆ విద్యార్థి మంత్రికి చెబుతూ.. సైకిల్ కావాలన్న కోర్కెను వెలిబుచ్చాడు. విద్యార్థి శరత్ చొరవను చూసి ఆశ్చర్యపోయిన మంత్రి పెమ్మసాని సైకిల్ కొనిస్తానని హామీనిచ్చారు. అన్న మాట ప్రకారం కొత్త సైకిల్‌ను మంగళవారం ప్రత్యేకంగా నందివెలుగు పంపారు. స్థానిక నాయకులు, మేము సైతం టీమ్ సభ్యులు ఆ సైకిల్‌ను శరత్ ఇంటికి చేర్చారు. సాయంత్రం స్కూలు నుంచి వచ్చిన శరత్‌కు ఇంటి ముంగిట సైకిల్‌ను చూసి మహదానందపడ్డాడు. మంత్రికి కృతజ్ఞతలు చెప్పాడు.

26న 'భారత రాజ్యాంగం' పుస్తకావిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రచించిన 'భారత రాజ్యాంగం' పుస్తకావిష్కరణ ఈనెల 26 నిర్వహించనున్నారు. స్థానిక శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్న ఆహ్వాన పత్రికలను మంగళవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పుస్తకంతో పాటు మరో నాలుగు పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. శాసనమండలి చైర్మన్ కె.మోషేన్‌రాజు, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె. రామకృష్ణ, వి.శ్రీనివాసరావు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, ఎల్‌వీపీ ఉద్యోగ సంఘ నాయకుడు వీవీకే సురేష్, ఎల్ఎస్ భారవి, అవధానుల హరి, కై లాష్‌నాథ్, ఎస్ఎం సుభానీ, వెంకట్రావు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: విశాఖపట్నంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో జరుగనున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర మహా సభల పోస్టర్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.గంగాధరరావు బుధవారం ఆవిష్కరించారు. సంఘం వర్సిటీ శాఖ కార్యదర్శి వంశీ మాట్లాడుతూ మహాసభలలో 1200 మంది ప్రతినిధులు పాల్గొనున్నారని తెలిపారు. మహాసభలలో విద్యారంగ సమస్యలు, విద్యారంగ స్థితి తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించునున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ శాఖ వైస్ ప్రెసిడెంట్ మనికంఠ, జాయింట్ సెక్రటరీ గంగాధర్, సాయి, అక్షయ కుమార్, శివరామరాజు, గణేష్ పాల్గొన్నారు.

24న లక్ష్మణరావు ఆత్మీయ సమావేశం




తెనాలి: కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుతో ఆత్మీయ సమావేశం ఈ నెల 24వ తేదీ సాయంత్రం స్థానిక ఎన్జీవో హోమ్‌లో జరగనుంది. సంబంధిత గోడపత్రికను మంగళవారం స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, జిల్లా కోశాధికారి గయానుద్దౌలా, జిల్లా కార్యదర్శులు సాంబశివరావు, కేదారనాథ్, నాయకులు పాల్గొన్నారు.

ట్రంప్ పాలనపై భయాందోళన



లక్ష్మీపురం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టమైన విధానాలతో కూడిన వైఖరితో ప్రపంచ దేశాల మన్ననలను చూరగొనాలని విశ్లేషకులు, విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో రెండోసారి ట్రంప్ పాలనపై చర్చ గోష్టి మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి విద్యావేత్త ఆర్‌వీ సింగరయ్య, విశ్రాంత అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

భారతీయ మజ్దూర్ సంఘ్ కరపత్రం ఆవిష్కరణ



లక్ష్మీపురం: భారతీయ మజ్దూర్ సంఘ్ తపాలాశాఖ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని జిల్లా కార్యాలయంలో సంఘ్ 70 ఏళ్ల ప్రస్థానంపై కరపత్రాన్ని రాష్ట్ర పూర్వ అధ్యక్షులు మన్నవ శ్రావణ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు డాక్టర్ కల్లకంటి నాగార్జున, సంఘ్ రాష్ట్ర కార్యదర్శి లోవరెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీ కృష్ణ, రైల్వే డివిజన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, పోస్టల్ డివిజన్ కార్యదర్శి మురళీ కృష్ణ, ఆటో యునియన్ కార్యదర్శి వీరేంద్ర కూమార్ తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం: సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో తొలి సోషలిస్టు రాజ్య స్థాపకుడు దివంగత లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం నిర్వహించారు. తొలుత లెనిన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నాయకులు రావుల అంజిబాబు, జి.సురేష్ బాబు, సి.హెచ్.విజయ్‌కుమార్, ఎస్.చిన్న, తోట బాబు, సి.హెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు- 2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య మంగళవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరాలో ఉండదని చెప్పారు. బ్రాడీపేట 1/18 నుంచి 6/22 లైను ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృద్ధులతో మానవత ఆత్మీయ పలకరింపు



కనకరత్నంను సత్కరించిన మానవత బాధ్యులు

తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత, తెనాలి శాఖ వినూత్నంగా నిర్వహిస్తున్న వృద్ధులతో ఆత్మీయ కలయిక అభినందనలు అందుకుంటోంది. ఈ క్రమంలో ప్రతినెల 90 ఏళ్లకు పైబడిన వృద్ధులను వారి ఇంటికే వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన దామర్ల కనకరత్నంను మానవత బాధ్యులు కలిశారు. ఆమె ఇంటికి వెళ్లి, యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఆరోగ్యకర జీవనం వెనుక విశేషాలను ఆమె నోటివెంట విన్నారు. మానవత సభ్యుల్లో ఒకరైన విశ్రాంత కాలేజి ప్రిన్సిపాల్ జీవీఎస్ఎస్ ప్రభాకర్ అత్తయ్య ఆమె. వయసు తొంభై ఏళ్లుపైగా ఉన్నా ఆమె చాలా చలాకీగా, గొప్ప జ్ఞాపకశక్తిని కలిగివుండటం విశేషమని మానవత, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అన్నారు. ఆమెకు 12 మంది సంతానంలో ప్రస్తుతం అయిదుగురు జీవించి ఉన్నారని తెలుసుకున్నారు. తన బిడ్డలనే కాకుండా దాదాపు 25 మందిని పెంచారు. ఇంత వయసులోనూ ఆమెకు షుగర్, బీపీ లేవు. స్మార్ట్ ఫోను వినియోగిస్తున్నారు. చిన్నతనం నుంచీ ఆహారంలో ఎక్కువశాతం జొన్నలు, సజ్జలు, రాగులు ఉండేలా చూశారు. వీలైనంతగా పళ్లు ఎక్కువగా వాడుతున్నారు. మితాహారం పాటిస్తున్నారు. రోజూ ఒక దానిమ్మ రసం తాగుతున్నారు. అందరితోనూ ఆత్మీయంగా గడుపుతున్నారు. అవే తన ఆరోగ్యానికి హేతువులని చెప్పారామె. మానవత బాధ్యులు ఆమెను అభినందించి జ్ఞాపికను అందజేసి వీడ్కోలు తీసుకున్నారు. కార్యక్రమంలో మానవత, తెనాలి అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, కార్యదర్శి పి.వెంకట్, డీవీ సోమయ్య శాస్త్రి, సీహెచ్ సాంబశివరావు, ఒ నరసింహారావు, ప్రభాకర్ దంపతులు, కనకరత్నం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

తెనాలి: శిశు అభివృద్ధి పథకం అధికారి కార్యాలయం, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, తెనాలి పరిధిలోని పట్టణ మున్సిపాలిటీ, రూరల్ మండలం, కొల్లిపర మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేశారు. అర్హులైన మహిళా అభ్యర్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ డాక్టర్ ఎం.సునీత నోటిఫికేషన్ జారీచేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తెనాలి నియోజకవర్గంలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త, అయిదు అంగన్‌వాడీ సహాయకురాళ్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. తెనాలి రూరల్ మండల గ్రామం కోపల్లెలోని కోపల్లె-1 అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టును బీసీ-సికి రిజర్వుచేశారు. ఈ పోస్టులు స్థానికంగా నివాసం ఉంటున్న 21 సంవత్సరాల నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగిన వివాహితులైన మహిళలు అర్హులని డాక్టర్ సునీత తెలిపారు. అభ్యర్థిని పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలనీ వివరించారు. అదేవిధంగా తెనాలి రూరల్ మండల గ్రామం జగ్గడిగుంటపాలెం-1 అంగన్‌వాడీ కేంద్రం (ఎస్టీ), హాఫ్‌పేట గ్రామంలోని హాఫ్‌పేట-2 అంగన్‌వాడీ కేంద్రం (బీసీ-బి), తెనాలి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులోని 22వ వార్డు-1 అంగన్‌వాడీ కేంద్రం (ఎస్టీ), 31వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రం (బీసీ-బి), కొల్లిపర మండల గ్రామం అత్తోటలోని అత్తోట-2 అంగన్‌వాడీ కేంద్రం (బీసీ-బి)లో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులు భర్తీ చేయనున్నట్లు వివరించారు. వీరికి కూడా వయసు 21-35 ఏళ్ల వారై ఉండాలని. వివాహితులై ఉండాలి. ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అర్హులు, అభ్యర్థినిలలో 21 సంవత్సరాల వయసు నిండినవారు లేకుంటే 18 సంవత్సరాలు నిండిన వారిని పరిగణనలోకి తీసుకుంటారు. ఈ పోస్టుల నియామకం తాత్కాలికమని, ఎంపికై న వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తారని వివరించారు. పుట్టినతేదీ, వయసు, విద్యార్హత, నివాసస్థల ధృవీకరణ పత్రాలు, వితంతువు అయితే భర్త మరణ ధృవీకరణ, అనాధలు, వికలాంగులైతే సంబంధిత ధృవీకరణలతో అభ్యర్థులు తమ దరఖాస్తులను శిశు అభివృద్ధి పథకపు అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, తెనాలి, వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజి ఎదురు, కఠెవరం పంచాయతి, తెనాలి-522 201 చిరునామాకు ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పంపుకోవాలని సూచించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్ బాబు

తెనాలి రూరల్: గంజాయి విక్రయాలు జరిపినా, గంజాయి సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెనాలి త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు హెచ్చరించారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి తెనాలిలో విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేశారు. మంగళవారం మధ్యాహ్నం త్రీ టౌన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుల వివరాలను సీఐ వెల్లడించారు. సుల్తానాబాద్ శివారు ప్రాంతంలో గంజాయి ముఠా ఉందని, అక్కడ విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేయడం జరిగిందన్నారు. సుల్తానాబాద్ వడ్డెర కాలనీకి చెందిన వేముల సాయి మణికంఠ, తమ్మిశెట్టి మదన్‌కుమార్, యడ్ల లింగయ్య కాలనీకి చెందిన ముత్యాల విజయ్ అలియాస్ చిన్న విజయ్, మూర్తి శివకుమార్ కుటేట్, సుందరయ్య నగర్‌కు చెందిన ధనావత్ పార్థు అలియాస్ దత్తు పట్టుబడగా సుల్తానాబాద్‌కు చెందిన కుంచాల హనుమంతరావు, ప్రేమ్ పరారైనట్లు చెప్పారు. అదుపులోకి తీసుకున్న ఐదుగురి నుంచి కిలో 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమేష్ బాబు చెప్పారు. వీరిలో కొందరు పాత నేరస్తులు ఉన్నారని, పరారీలో ఉన్న కుంచాల హనుమంతరావు అరుకు నుంచి గంజాయి తెచ్చి ఇక్కడ సేవించడంతో పాటు పొట్లాలుగా చేసి విక్రయాలు జరుపుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. గంజాయి ముఠాను అరెస్ట్ చేసిన సీఐ రమేష్ బాబు, సిబ్బంది పి.మురళీ, కె బాబూరావు, ఎస్.జైకర్, జి.నరేంద్ర, సీహెచ్ శ్రీరామమూర్తిని డీఎస్పీ జనార్ధనరావు అభినందించారు.

బీజేపీ ఫాసిస్టు విధానాలను వ్యతిరేకించాలి

సీపీఎం నాయకుడు నర్సింగరావు



మాట్లాడుతున్న నర్సింగారావు, వై.నేతాజీ

లక్ష్మీపురం: బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలు అనుసరిస్తుందని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్.నర్సింగరావు పేర్కొన్నారు. లెనిన్ శతవర్ధంతి సభ మంగళవారం గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్స్, ఎంగెల్స్ రాసిన సిద్ధాంతాన్ని లెనిన్ రష్యాలో సోషలిజం సాధించటం ద్వారా ఆచరణలోకి తెచ్చారని పేర్కొన్నారు. లెనిన్ చెప్పిన విధంగా నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని అన్వయించటం ద్వారా భారత దేశంలో కార్మికవర్గ విప్లవాన్ని జయప్రదం చేయటానికి ప్రజల్ని చైతన్యవంతం చేయాలన్నారు. దేశంలో బీజేపీ ఫాసిస్టు విధానాలు అనుసరిస్తుందని, రాష్ట్రాల హక్కులను కుదిస్తుందని దుయ్యబట్టారు. గవర్నర్లను అడ్డుపెట్టుకొని రాష్ట్రాలపై పెత్తనం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా ఆర్థికంగా అణచివేస్తుందని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ కార్మికుల ఉపాధిని విస్మరించి, ఏఐ వంటి నూతన టెక్నాలజీని ప్రోత్సహిస్తే ఉత్పత్తి పోగుబడి, ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి సంక్షోభం వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నళినీకాంత్, ఎన్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు ఏసీ కళాశాలను సందర్శించనున్న నాక్ టీమ్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఏసీ కళాశాలను బుధ, గురువారాల్లో నాక్ బృందం సందర్శించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజెస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు నాక్ గుర్తింపు కల్పించే విషయమై అకడమిక్‌తో పాటు మౌలిక వసతులతో పాటు వివిధ అంశాల ప్రగతిపై విశ్లేషించనున్నారని పేర్కొన్నారు. కాగా నాక్ టీం పర్యటన నేపథ్యంలో కళాశాల కరస్పాండెంట్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ కేఎఫ్ పరదేశిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ మోజెస్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పీఎం వినయ్‌తేజ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.